జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 54 | మంగళవారం 15 జూలై 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## రేషన్‌కార్డు.. పేదల ఆత్మగౌరవ ప్రతీక



5.61 లక్షల కుటుంబాలకు కొత్త కార్డులు.. 3.10 కోట్ల మందికి సన్నబియ్యం
దండగన్న సాగును పండగ చేశాం..
రైతుల ప్రతి ధాన్యపు గింజనూ కొన్నాం
మహిళలను ఆర్టీసీ బస్సుల యజమానులను చేశాం
పభుత్వం ఏర్పాటై రెండేళ్లయ్యే నాటికి నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తాం
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుచేసి తీరుతాం
ప్రాజెక్టుల నాణ్యతపై చర్చకు బీఆర్ఎస్ సిద్ధమా?.. 2034 దాకా కాంగ్రెసదే అధికారం
సూర్యాపేట జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
ఇది తెలంగాణ చరిత్రలో నిలిచిన రోజు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ/సూర్యాపేట, జూలై 14(సందేశం టైమ్స్): తెలంగాణలో ప్రభుత్వం అందించే రేషన్‌కార్డు కేవలం సరుకులు అందించే పత్రం మాత్రమే కాదని, పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఆకలి తీర్చే ఆయుధమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కానీ, గత పదేళ్ల పాలనలో బీఆర్ఎసకు ఏనాడూ పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలని, సన్నబియ్యం అందించాలన్న ఆలోచన కూడా రాలేదని ఆరోపించారు. తాము మాత్రం రాష్ట్రంలో 26 లక్షల మందికి రేషన్‌కార్డులు ఇచ్చామని, 5.61 లక్షల కొత్త కార్డులు ఇస్తున్నామని తెలిపారు. 3.10 కోట్ల మందికి రేషన్‌ద్వారా సన్నబియ్యం అందించి వారి కడుపు నింపుతున్నామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో బెల్టుషాపులు తెరిస్తే.. తాము రేషన్ షాపులు తెరుస్తున్నామని చెప్పారు. పేదలు సన్నబియ్యం అన్నం తింటుంటే.. బీఆర్ఎస్ నాయకులు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని విమర్శించారు. సోమవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పట్టణంలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం రేవంత్ మాట్లాడారు. దండగ అన్న వ్యవసాయాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పండగ చేశామన్నారు. ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడమే కాకుండా రూ.500 బోనస్ ఇచ్చామని, 25,55,965 మంది రైతులకు రూ.25 వేల కోట్లు వెచ్చించి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే 1.50 కోట్ల ఎకరాలకు, 70 లక్షల మంది రైతులకు రూ.9 వేల కోట్ల రైతుభరోసా అందించి మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. అంతేకాకుండా రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొన్నామని, దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రాష్ట్రంలో 2.85 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి రికార్డు సృష్టించామని అన్నారు.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం



నల్లగొండ టౌన్, జూలై 14(సందేశం టైమ్స్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉందని, అయితే తాము మతపరమైన రిజర్వేషన్లను ఒప్పుకోబోమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత తొలిసారిగా నల్లగొండకు వచ్చిన ఆయన కార్యకర్తల సమ్మేళనం అనంతరం మీడియాతో మాట్లాడారు. 42శాతం రిజర్వేషన్లలో 10శాతం ముస్లిం రిజర్వేషన్లను(మతపరమైన రిజర్వేషన్లు) వ్యతిరేకిస్తున్నామన్నారు.
సుప్రీంకోర్టు కూడా దీనిని అంగీకరించలేదని ఆయన గుర్తు చేశారు. మతపరమైన రిజర్వేషన్ల వల్ల అసలైన బీసీలకు నష్టం జరుగుతుందని రాష్ట్ర బీసీలు గుర్తించాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారి కార్యకర్తలకే రేషన్‌కార్డులు ఇచ్చే ప్రయత్నం చేస్తోందని, ఇప్పటికే దళారులు రంగంలోకి దిగారని ఆయన ఆరోపించారు. నల్లగొండ గడ్డపై కుటుంబ పాలనను అంతం చేయాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పోరాడాలని, బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాంచందర్‌రావు చెప్పారు.

## స్థానికంపై కమలం గురి



హైదరాబాద్, జులై 14(సందేశం టైమ్స్): స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర బీజేపీ నాయకత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పంచాయతీ నుంచి మున్సిపాలిటీల వరకు పట్టు సాధించే దిశగా వ్యూహాత్మక కార్యాచరణను రూపొందిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు బీజేపీ అ?ధికారంలోకి వస్తేనే 'స్వర్ణ తెలంగాణ' సాధ్యం అన్న నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం, గ్రామీణ ప్రాంతాల్లో మండలం, నగరాల్లో డివిజన్ కేంద్రంగా కార్యక్రమాలు నిర్వహించనుంది. గ్రామాలవారీగా తమ బలం, బలహీనతలపై కూడా బీజేపీ నివేదికలను రూపొందించుకుంది. వీటి ఆధారంగా స్థానిక పార్టీ క్యాడర్‌తో సమీక్షించి అందుకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడానికి సన్నద్ధమైంది. మంగళవారం రాష్ట్ర పదాధికారులకు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనుంది. ఏయే ప్రాంతాల్లో పార్టీకి పట్టుంది.. ఎక్కడ బలహీనంగా ఉంది.. వంటి అంశాలను ఇందులో సమీక్షించనున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ కూడా హాజరు కానున్నారు. మరోవైపు, రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలను ఐదు జోన్‌లుగా విభజించిన పార్టీ నాయకత్వం, ఆయా జోన్‌ల పరిధిలోని మండల పార్టీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది.

## కల్లు సొసైటీలపై నిషేధానికి కుట్ర

బర్కత్‌పుర, జూలై 14(సందేశం టైమ్స్): కల్తీ కల్లు పేరుతో కలు సొసైటీలను నిషేధించడానికి రాష్ట్ర ప్రభుత్వం, లిక్కర్ మాఫియాలు కుట్రలు చేస్తున్నాయని గౌడ సంఘాల నేతలు ఆరోపించారు. కూకట్‌పల్లిలో జరిగిన కల్తీ కల్లు ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌడ కల్లు గీతల సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, గౌడ కల్లు గీత వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఆయిలి వెంకన్న గౌడ్, గౌడ జనహక్కుల పోరాట సమితి అధ్యక్షుడు యెలికట్టే విజయ్‌కుమార్ గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్, గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంగ సదానందం గౌడ్, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.దుర్గయ్యగౌడ్, బీసీ రచయితల సంఘం అధ్యక్షుడు బైరు శేఖర్ మాట్లాడారు.

## నాకు రక్తం బలి కావాలి.. లేదంటే అల్లకల్లోలమే!

**మహమ్మారి వస్తుంది.. అగ్నిప్రమాదాలూ ఉంటాయి**
**ఈ ఏడాది కూడా వర్షాలు బాగా కురుస్తాయి**
**రంగంలో మాతంగి స్వర్ణలత భవిష్య వాణి**



సికింద్రాబాద్, జూలై 14(సందేశం టైమ్స్): బోనాల జాతరను సాకలు పోసి బాగా చేసినా.. ప్రతిసారి చేసినట్లే ఈసారి కూడా పొరపాటు చేశారని రంగం కార్యక్రమంలో మాతంగి స్వర్ణలత మండిపడ్డారు. తనకు రక్తం బలి కావాలని, లేకపోతే అల్లకల్లోలం జరుగుతుందని హెచ్చరించారు. 'మీరు మాత్రం ఆరగిస్తారు.. నాకు మాత్రం బలి ఇవ్వరా?' అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో మహమ్మారి వస్తుందని, అగ్ని ప్రమాదాలు జరుగుతాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బోనాల జాతర సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో సోమవారం ఉదయం రంగం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. తనకు పూజలు సరిగా నిర్వహించాలని.. అలా చేయకపోతే రక్తం కక్కుకొని చస్తారని, పూజలు సరిగా నిర్వహించకపోవడం వల్లే మరణాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఏడాది తన కోరికలు చెబుతున్నానని, అయినా పండుగ సందర్భంగా ఏదో ఒక ఆటంకం కల్పిస్తూనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు వారాల పాటు తనకు పూజలు చేసి, సాక పోసి ఆనందపరచాలన్నారు. తన రూపాన్నిపెట్టడానికి కూడా అడ్డు పడుతున్నారని అన్నారు.. తనను మొక్కే వాళ్లు ఉండాలని, నిందలు వేసే వాళ్లు ఉండకూడదన్నారు. తనను కొలిచే వారికి ఎప్పుడూ తోడుగా నిలబడతానని చెప్పారు. ఈ ఏడాది కూడా వర్షాలు బాగా కురుస్తాయని చెప్పారు.

## కేసుల్లో పట్టుబడ్డ వాహనాన్ని రుణ సంస్థ తీసుకోలేదు



హైదరాబాద్, జూలై 14 (సందేశం టైమ్స్): అనుమతి లేని వస్తువులు, మత్తుపదార్థాలను తరలించిన కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను తమకు అప్పగించాలని రుణసంస్థలు కోరలేవని హైకోర్టు స్పష్టం చేసింది. రుణం ఇచ్చినంత మాత్రాన వాటికి యజమానులు కాలేవని తెలిపింది. ఎలాంటి పత్రాలు లేకుండా నల్లబెల్లం, పటిక తరలిస్తున్న బొలేరో వాహనాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఆ వాహనం తమ తాకట్టులో ఉన్నందున దానిని తమకే అప్పగించాలని కోరుతూ టైగర్ క్యాపిటల్ అనే సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ టీ వినోద్‌కుమార్ ధర్మాసనం.. "రుణం ఇచ్చినంత మాత్రాన యజమాని కాలేరు. ఒకవేళ వాహనం కింద పడి ఎవరైనా పడి చనిపోతే యజమానినే బాధ్యుడిగా చేస్తారు కదా! అలాంటప్పుడు వాహనం మీదెలా అవుతుంది? రుణం చెల్లించే పరిస్థితి లేకపోతే వాహన యజమాని, రుణసంస్థకు ఉన్న ఒప్పందం మేరకు వేలం వేసి రుణ మొత్తం పోను మిగతాది యజమానికి చెల్లించాలి" అని తెలిపింది. కేసు ముగిసిన తర్వాత వాహనాన్ని యజమానికే తప్ప రుణ సంస్థకు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేసింది.

## గవర్నర్ పదవికి
# అశోక్ గజపతిరాజు వన్నె తేవాలి: సీఎం, లోకేష్



అమరావతి, జులై 14,(సందేశం టైమ్స్) : గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజును నియమించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన గౌరవం అని అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము , ప్రధాని నరేంద్ర మోదీకి , కేంద్ర మంత్రివర్గానికి కృతజతలు తెలియజేశారు. అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా ఆ పదవికి వన్నె తేవాలి అని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆకాంక్షించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా అశోక్ గజపతిరాజుకు సీఎం, మంత్రి విషెస్ తెలియజేశారు.

చంద్రబాబు ట్వీట్

'గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్ గజపతిరాజుకు అభినందనలు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు దక్కిన గౌరవం. ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కృతజ్ఞతలు. గవర్నర్‌గా తన విధుల నిర్వహణలో అశోక్ గజపతి రాజు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

# అధికారులకు మంత్రి నారా లోకేష్ స్వీట్ ఛాలెంజ్



మంగళగిరి, జులై 14,(సందేశం టైమ్స్) : ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తోంది. ఈ క్రమంలో విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వంద రోజుల్లో గుంతలు లేని రోడ్లు ఉన్న నియోజకవర్గంగా మంగళగిరి ని తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతలో మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ను నెం.1గా తీర్చిదిద్దేలా సుమారు రూ.4.40 కోట్ల విలువైన ఐదు అధునాతన వాహనాలను మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. చెత్తను తరలించేందుకు రెండు రిఫ్యూజ్ కాంపాక్టర్ మెషిన్ వాహనాలు, రెండు స్వీపింగ్ మెషిన్ వాహనాలతో పాటు బీటీ రహదారులు గుంతలు పూడ్చే అధునాతన పాత్ హెూల్ రోడ్ రిపేర్ వాహనాన్ని ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ జెండా ఊపి ప్రారంభించారు. ట్రాక్టర్లు, ఆటోల ద్వారా సేకరించిన వ్యర్థాలను ఈ కాంపాక్టర్ వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించనున్నారు. ఎంటీఎంసీ పరిధిలో బీటీ రోడ్లపై ఎప్పటికప్పుడు గుంతలు పూడ్చేందుకు రూ.1.48 కోట్ల విలువైన పాత్ హెూల్ రిపేర్ వాహనంతో పాటు సుమారు రూ.1.2 కోట్ల విలువైన రెండు స్వీపింగ్ మెషిన్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. స్వచ్ఛ మంగళగిరి సాధనకు ఈ అధునాతన వాహనాలు దోహదపడనున్నాయి. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరిని గుంతలు లేని రోడ్లు ఉన్న నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు వంద రోజుల ఛాలెంజ్‌ను అధికారులు స్వీకరించాలన్నారు. వంద రోజుల తర్వాత రోడ్లపై ఏమైనా గుంతలు ఉంటే వాట్సాప్ లేదా స్వచ్ఛాంధ్ర యాప్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేలా కసరత్తు చేయాలని ఆదేశించారు. మంత్రి లోకేష్ ఛాలెంజ్ ను తాము స్వీకరిస్తున్నామని, స్వచ్ఛతలో మంగళగిరిని నెం.1 తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా అధికారులు చెప్పారు.

## త్వరలోనే పేర్ని నాని జైలుకు..
# టీడీపీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



అమరావతి, జులై 14,(సందేశం టైమ్స్) : వైసీపీ అవినీతి, దురాగతాలు రోజుకొకటి బయపడుతున్న వేళ డైవర్షన్ పాలిటిక్స్‌కి వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పేర్ని నాని తెరలేపారని తెలుగుదేశం పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా విమర్శించారు. ప్రశాంతమైన పామర్రులో పేర్ని నాని అల్లర్లు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా రాష్ట్ర ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా పేర్ని నాని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రౌడీలు, కిరాతకులు చేసే పనులకు.. పేర్ని నాని బ్యాచ్‌కు ఏం తేడా ఉందని ప్రశ్నించారు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా.(సోమవారం) అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో వర్ల కుమార్ రాజా మీడియాతో మాట్లాడారు. రాత్రులు ఎవరూ దాడులు చేస్తారనే అశాంతితో పామర్రు రైతులు ఉన్నారని చెప్పుకొచ్చారు. పేర్ని నాని వ్యాఖ్యలపై, ఫోన్ సంభాషణపై జగన్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఏపీలో అశాంతిని సృష్టించేందుకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి జగన్ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ అమలుతో జగన్ రెడ్డిలో ఆందోళన మొదలైందని అన్నారు. వైసీపీ నామరూపాలు లేకుండా పోతుందనే భయపడే పేర్ని నానితో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరదీశారని ఆక్షేపించారు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా.

## విశాఖపట్నం పోర్ట్ వరల్డ్ టాప్ 20 :
# కేంద్ర షిప్పింగ్ మంత్రి సోనోవాల్




విశాఖపట్నం, జులై 14,(సందేశం టైమ్స్) : విశాఖపట్నం పోర్ట్ ప్రపంచంలోని 20 అద్భుత నౌకాశ్రయాలలో ఒకటని కేంద్ర షిప్పింగ్ మంత్రి సోనోవాల్ చెప్పారు. ఇవాళ విశాఖ వచ్చిన ఆయన 320 కోట్ల రూపాయలతో చేసిన పోర్ట్ ఆధునీకరణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కేంద్ర మంత్రి బిమ్స్ టెక్ పేరుతో మ్యారి టైం కాంక్లేవ్ నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన నిపుణులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సదస్సులో అంతర్జాతీయ వాటర్ వేస్, మారిటైమ్ ట్రేడ్ కి సంబంధించి అర్థవంతమైన చర్చ జరిగింది. ఈ సందర్భంలో మారి టైం ట్రాన్స్ పోర్ట్ అగ్రిమెంట్ జరిగింది. ఈ కాంక్లేవ్ కు ఆరు దేశాల నుండి 26 మంది సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ల గురించి చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి 'ఈ రోజు జరిగిన కాంక్లేవ్ మంచి ఫలితాలు ఇస్తుందని భావిస్తున్నాం. మారిటైమ్.. ట్రేడ్స్ పై ఫలప్రదమైన చర్చ జరిగింది. భవిష్యత్తులో క్రూయిజ్ రంగం కీలకంగా పనిచేస్తుంది. విశాఖ పోర్టు ప్రపంచంలో టాప్ 20 లో ఉంది. విశాఖపట్నం పోర్టు పరిధిలో 320 కోట్ల రూపాయల ప్రాజెక్టులకు ఈరోజు శంకుస్థాపన చేశాం.' అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నౌకాయాన శాఖ సహాయ మంత్రి ఠాకూర్, ఎంపీ భరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

# 16న కేంద్ర మంత్రి వద్ద రేవంత్, చంద్రబాబు పంచాయతీ



(సందేశం టైమ్స్) : ఢిల్లీ జల వివాదంపై చర్చకు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 16న ఢిల్లీ లో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కావాలని కేంద్రం కోరింది. ఈ మేరకు వీరిద్దరిని ఆహ్వానిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ సర్క్యులర్ విడుదల చేసింది. ఈ భేటీకి హాజరయ్యేందుకు ఇద్దరు సీఎంలకు వీలవుతుందో లేదో తెలపాలని పేర్కొంది. మరోవైపు కృష్ణా, గోదావరి వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై రాష్ట్రంలోని ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులు, ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని సీఎం కోరనున్నారు.

రేపు ఢిల్లీ వెళ్లనున్న చంద్రబాబు

ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం ఢిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన అక్కడికి చేరుకోనున్నారు. కేంద్రమంత్రులు అమిత్‌షా, అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు. ఈనెల 17న రాత్రి 9 గంటలకు తిరిగి విజయవాడకు చంద్రబాబు చేరుకోనున్నారు.

# మహిళను కించపరిస్తే కమిషన్ స్పందించదా?

హైదరాబాద్, రాంనగర్, జూలై 14(సందేశం టైమ్స్) : గౌరవప్రదమైన హెూదాలో ఉన్న మహిళపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కించపరిచేలా వ్యాఖ్యలు చేయడంపై ఫిర్యాదు చేయడానికి వస్తే మహిళా కమిషన్ స్పందించదా? ఇదేం పద్ధతి? అంటూ జాగృతి మహిళానేతలు ప్రశ్నించారు. కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం మహిళాకమిషన్ కార్యాలయంలో వారు ఫిర్యాదుచేశారు. కాగా, ముందస్తు సమాచారం ఇచ్చినా చైర్‌పర్సన్ అందుబాటులో లేకపోవడం తగదని అసహనం వ్యక్తంచేశారు. కార్యదర్శి సైతం ఫిర్యాదులేఖను తీసుకునేందుకు అంగీకరించ కపోవడంతో అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. అయినా కమిషన్ చైర్‌పర్సన్ అందుబాటులోకి రాకపోవడంతో ఫిర్యాదు పత్రాన్ని కమిషన్ సభ్యులు సుధంలక్ష్మి, రేవతిరావు, ఉమ, అప్రోజ్ షహీనాకు అందజేశారు. కాగా, కవితపై తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జాగృతి ఎస్టీ సెల్ హైదరాబాద్ అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో మల్లన్న చిత్రపటానికి చెప్పులతో కొడుతూ నిరసన వ్యక్తం చేశారు. మరో వైపు, తెలంగాణ జాగృతి శ్రేణులు విద్యార్థిసంఘాలు, పలుచోట్ల నిరసనలు, ఆందోళనలు చేపట్టాయి. సోమవారం ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహంవద్ద, ఎల్‌బీనగర్‌లోని జ్యోతిరావుపూలే విగ్రహంవద్ద ఆందోళన నిర్వహించారు. మల్లన్న శాసనమండలి సభ్యత్వాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఓయూ జేఏసీ చైర్మన్ ఎల్చాల దత్తాత్రేయ, కందులమధు, కొప్పుల అర్జున్, రామకృష్ణ ఆధ్వర్యంలో ఓయూలో ఆందోళన నిర్వహించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. తెలుగు యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ నాయకులు, జేఎసటీయూ పరిధిలోని విద్యార్థి సంఘాల నాయకులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

# పక్కాగా హాజరు




జగిత్యాల,జూలై 14 (సందేశం టైమ్స్): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమయపాలనపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. టీచర్ల హాజరు కోసం ఫెషియల్ రికగ్నిషన్ ప్రవేశపెట్టనుంది. చాలామంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందడం లేదని, ప్రాథమిక పాఠశాలల్లో కొంత మంది విధులకు హాజరుకాకపోయినా మరుసటి రోజు రిజిస్టర్‌లో సంతకాలు పెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో పాటు పాఠశాలల పనివేళలకు ముందుగానే ఇంటిముఖం పట్టడం, వివిధ వ్యాపారాలు, ఇతర వ్యాపకాలలో నిమగ్నమవుతూ విద్యార్థుల భవిషత్తుతో ఆడుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కొవిడ్‌కు ముందు సర్కారు పాఠశాలల్లో బయోమెట్రిక్ అమలు చేశారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరయ్యారు. ఆ తర్వాత అవి మూలన పడడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఈ క్రమంలో టీచర్లకు ఫెషియల్ రికగ్నిషన్ హాజరు అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేశారు. సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు అమలవుతున్న విషయం తెలిసిందే. టీచర్లకు కూడా అమలు చేస్తే సక్రమంగా విధులకు హాజరయ్యే అవకాశం ఉంటుందనే అభిప్రాయం ఉంది.

# పోడు భూముల్లో సాగు అడ్డుకుంటే ఊరుకునేది లేదు



నెన్నెల,జూలై 14 (సందేశం టైమ్స్): దశాబ్దాల నుంచి గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అటవీశాఖ అధికారులు సాగు పనులను అడ్డుకుంటే ఊరుకునేది లేదని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐ కేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి హెచ్చరించారు. మండలంలోని జంగాల్‌పేట పంచాయతీ పరిధి కొత్తగూడెం శివారు భూముల్లో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. అటవీశాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఈ భూములను స్థానిక గిరిజనులు సాగు చేసుకుంటున్నారని అన్నారు. కొందరికి 1/70 చట్టం ప్రకారం పట్టాలు కూడా ఉన్నాయన్నారు. ఆ భూమిని దున్నితే కేసులు పెడతామని అటవీ శాఖ వారు బెదిరిస్తున్నారని అన్నారు. ఎన్నికల కంటే ముందు అటవీ భూ ముల్లో సాగులో ఉన్నవారికి హక్కు పత్రాలు ఇస్తామని కాంగ్రెస్ నాయ కులు ఓట్లు దండుకొని, అధికారంలోకి వచ్చాక మాట మారుస్తున్నారని విమర్శించారు. ఆదివాసీల హక్కులను కాలరాసే జీవో నం. 49ను రద్దు చేయా లని డిమాండ్ చేశారు. భూములు దక్కేంత వరకు గిరిజనులకు అండగా పోరాడుతామన్నారు. మాజీ ఉప సర్పంచ్ చిలుకయ్య, నాయకు లు మంచాల మధునయ్య, నాగే ష్, వెంకటేష్, సాగర్, దిలీప్, క మల, దుర్గక్క, లక్ష్మి, భీమక్క పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి



యాదగిరిగుట్టరూరల్,జూలై 14 (సందేశం టైమ్స్):ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. యా దగిరిగుట్టలోని ఆయా వార్డులలో నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గానికి ఇప్పటివరకు 3500 ఇళ్లు మంజూరయ్యాయని, అన్ని ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇంటికి కావాల్సిన ఇ సుకతోపాటు సామగ్రి తక్కువ ధరకు ఇచ్చే విధంగా అధికారులు సం బంధిత యజమానులతో మాట్లాడాలని చెప్పారు. ఇసుక కొరత ఉంటే తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఉదయం 6గంటల నుంచి 10 గంటలవరకు పట్టణమంతా కలియదిరిగి, పట్టణ సమస్యలు అడిగి తె లుసుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మిర్యాల లింగస్వా మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, మాజీ కౌన్సిల ర్లు సీస విజయలక్ష్మీకృష్ణగౌడ్, ముక్కెర్ల మల్లేశ్, ఎరుకల హేమేందర్‌గౌడ్, గుట్ట పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాటబత్తిని ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతిగౌడ్,రమేష్, జీవన్‌రెడ్డి,శ్రీనివాసరెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

# ఇనుప కూలర్ తగిలి.. విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి



జైనథ్, జూలై 14 (సందేశం టైమ్స్):ఉమ్మడి మండలంలోని భోరజ్ పరిధిలో గల పెండల్‌వాడ గ్రామంలో విద్యుత్ షాక్‌తో బావానే అశోక్(56) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అశోక్ ఆయన కుమారుడు రవి, ఆయన భార్య సుమన్‌బాయి, తల్లి గిరిజాబాయి రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రకు ఉపక్రమించారు. అశోక్ ఎప్పటి లాగే ఇంటి ఎదుట గదిలో నిద్రించాడు. %రాత్రి 12 గంటల ప్రాంతంలో నిద్రమత్తులో మంచంపై నుంచి కుడి కాలు ఎదురుగా ఉన్న ఇనుప కూలర్‌పై పడడంతో విద్యుత్ షాక్ వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జైనథ్ ఎస్సై గౌతం నాయక్, ఏఎస్సై ఆత్మారాం శవ పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# దేశంలో పేదల కోసం అవిశ్రాంత పోరాటం



ఉండవల్లి,జూలై 14 (సందేశం టైమ్స్): వంద ఏళ్ల సుదీర్ఘ చరిత్ర గల సీపీఐ దేశంలో పేదలు, రైతుల పక్షాన నిలబడి వారి కోసం అవిశ్రాంత పోరాటాలు సాగించిందని సీపీఐ జాతీయ నా యకురాలు సురవరం విజయలక్ష్మి అన్నారు. ఈ క్రమంలో ఎన్నో ఉద్యమాలు చేసి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తుందని తె లిపారు. ఉండవల్లి మండలం కం చుపాడులో సురవరం విజ్ఞాన కేంద్రంలో రవి అధ్యక్షతన జరిగిన మహాసభకు ఆమె ముఖ్యఅ తిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె సురవరం కపిల్, జిల్లా కార్యదర్శి ఆంజనేయుల తో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అ నంతరం సురవరం విజయలక్ష్మి మాట్లాడుతూ దున్నే వాడికే భూమి కావాలని మొట్టమొదట నినదించిన పార్టీ సీపీఐ మాత్రమేనన్నారు. ఆ దిశగా పేదల పక్షాన పోరాటాలు సాగిస్తు వారికి అండగా నిలబడిందన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రజాసంఘాలను ఏర్పాటు చేసి పోరాడితే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఆం జనేయులు మాట్లాడుతూ జిల్లాలో అధికారు లు సమస్యలను పరిష్కడంలో విఫలమయ్యార న్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆగస్టు 4న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా మహాస భలను విజయవంతం చేయాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని ధ్వజమెత్తారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారు లకు, పెత్తందారులకు అనుకూలంగా చట్టాలను రూపొందించడం సరైంది కాదన్నారు.

# పెండ్లి పత్రికలు పంచడానికి వెళ్తూ.. రెండు కుటుంబాల్లో విషాదఛాయలు




ఖానాపూర్ టౌన్/జన్నారం, జూలై 14 (సందేశం టైమ్స్):: మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని ఇందన్‌పెల్లి గ్రామానికి చెందిన చొప్పదండి లక్ష్మణ్, వరుసకు బామ్మర్ది అయిన మురిమడుగు గ్రామానికి చెందిన పడిగెల జశ్వంత్‌లు కలిసి పెండ్లి పత్రికలు పంచడానికి వెళ్లారు. ఇటీవలే లక్ష్మణ్‌కు పెండ్లి సంబంధం కాయం కావడంతో ఈనెల 18వ తేదీన పెండ్లి పెట్టుకున్నారు. పెండ్లి ఇంకా నాలుగు రోజులే ఉండడంతో ఖానాపూర్, నిర్మల్ పట్టణాల్లో ఉన్న తమ బంధువులకు పత్రికలు ఇవ్వడానికి ఉదయం పల్సర్ బైక్‌పై బయలుదేరారు నిర్మల్ వైపు వెళుతుండగా ఉదయం 11 గంటలకు ఖానాపూర్‌లోని కుమ్రం భీం చౌరస్తాలో అతివేగం వల్ల బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్లలోకి దూసుకెళ్లింది. తలకు బలమైన గాయాలు కావడంతో చొప్పదండి లక్ష్మణ్(25), పడిగెల జశ్వంత్(19)లు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. చొప్పదండి గంగన్న-కమల దంపతుల చిన్న కుమారుడు లక్ష్మణ్ మృతిచెందడంతో రోదనలు మిన్నంటాయి. ఇంకా నాలుగు రోజుల్లోనే పెండ్లి ఉండడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. లక్ష్మణ్‌కు ఒక అన్న, ఒక చెల్లి ఉన్నారు. జశ్వంత్ మృతదేహం వద్ద అతని తల్లిదండ్రులు భాగ్యలక్ష్మి-రాజన్న, అన్న వంశీ, బంధువులు రోదించిన తీరు అందరిని కలచివేసింది.

# తొలి వర్షానికే గొల్లఘాట్ వాసుల బురద కష్టాలు



తాంసి(భీంపూర్) :జూలై 14 (సందేశం టైమ్స్):మొదటి వర్షాలే గొల్లఘాట్ గ్రామస్థులకు కష్టాల్ని తెచ్చిపెట్టాయి. మండలంలోని ఈ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి తొలి వర్షం పడగానే పూర్తిగా బురద మయమై రాకపోకలకు ఆటంకాలుగా మారాయి. ఈ గ్రామానికి రోడ్డు లేక ఆర్టీసీ బస్సును ఎరగవు. ఇప్పటివరకు ఆటోలు, ద్విచక్ర వాహనాలే ప్రధాన రవాణా మార్గం. కానీ వర్షాల నేపథ్యంలో ఆ ఆటోలు కూడా రావడం లేదని వాపోతున్నారు. %ద్విచక్రవాహనదారులు పడుతూ.. లేస్తూ, దారికి తగిలే రాళ్లు, రప్పల వల్ల గాయాలపాలు అవుతున్నారు . ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, గర్భిణులు మరింత కష్టాల పాలవుతున్నారు. సంబంధిత అధికారులకు రోడ్డు సమస్యను విన్నవించినా, వినతులు అందచేసినా పరిష్కారానికి మాత్రం చొరవచూపడం లేదు. వర్షాకాలం రాగానే ప్రతి సంవత్సరం ఇలాగే కష్టాల్ని ఎదుర్కోవాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ రోజుల్లోనూ ఈ దారి ఇబ్బందిగానే ఉంటుంది.వర్షం కురిస్తే మాత్రం బురదలో కాళ్లు కదలడం కూడా కష్టమవుతుంది. పెద్ద పెద్ద వాహనాలు రాకపోవడంతో బయటకు వెళ్లే అవకాశం లేక ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు.

# ఒంగోలు మెప్మాలో ఏం జరుగుతుంది?




◆ అవినీతి వ్యవహారాలపై ఎండీ తేజ్‌భరత్ సీరియస్
◆ %ఆర్పీలపై కఠినచర్యలు తీసుకోవాలని పీడీకి ఆదేశం
◆ ఇకపై బోగస్ పొదుపు గ్రూపులు ఏర్పాటు చేసే వారికి చుక్కలే
◆ గత అక్రమాలపై చర్యలు లేకపోవడమే కారణమా!

జూలై 14 (సందేశం టైమ్స్):పొదుపు మహిళల పేరుతో నకిలీ సంఘాలు సృష్టించి కోట్లు దండుకుంటున్న ఆర్పీల అవినీతిపై ఆ సంస్థ ఎండీ సీరియస్ అయ్యారు. అక్రమాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని పీడీ శ్రీహరిని ఆదేశించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అసలు మెప్మాలో ఏం జరుగుతుందోననే చర్చ జిల్లా అంతగా మొదలైంది. కొందరు ఆర్పీల అక్రమాలు వెలుగులోకిరావడంతో బాధిత పొదుపు మహిళలు సైతం ఇప్పుడిప్పుడే బయటకొచ్చి అన్యాయాలను వివరిస్తున్నారు. రెండు నెలల క్రితం ఒంగోలు నగర పరిధి కేశవస్వామిపేటలో ఉండే యానాదులను మోసం చేసిన ఓ ఆర్పీ భారీగానే దండుకుంది. దీనిపై రచ్చకావడంతో తాను తీసుకున్న సొమ్ము చెల్లిస్తానంటూ సభ్యులకు సర్దిచెప్పుకుంది. నేటికీ ఎలాంటి చెల్లింపులు జరగకపోవడం, మరోవైపు అధికారులు సైతం చర్యలు తీసుకోకపోవడంతో అదేబాటలో మరికొందరు బోగస్ గ్రూపుల తయారీలో ఉన్నారు. తాజాగా పేర్నమిట్ట ఆర్పీపై వచ్చిన ఆరోపణలతో బోగస్ గ్రూపుల వ్యవహారాలు బయటకు వస్తున్నాయి. ఇప్పటికే ఈ భాగోతంలో కీలకపాత్ర వహించిన వారిని తప్పించగా, మరికొందరి పాత్రపై విచారణ సాగుతుంది. రాష్ట్రప్రభుత్వం పొదుపు సంఘాలను బలోపేతం చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోంది. వారి కోసం పలు పథకాలను అమలుచేస్తూ వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతుంటే.. ఒంగోలు మెప్మాలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతోంది. అక్కడ రోజుకో అవినీతి భాగోతం వెలుగులోకి వస్తోంది. వరుస పరిణామాల క్రమంలో మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ తేజ్ భరత్ సీరియస్ అయ్యారు. ఈఆయన జిల్లా అధికారి పీడీ శ్రీహరితో మాట్లాడారు. ఆర్పీల అవినీతి వ్యవహారాలపై నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. గత ఏడాది నుంచి మెప్మాలో ఆర్పీల అవినీతిపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురిస్తుంది. పొదుపు సభ్యుల ఆధార్ కార్డులను ఆన్‌లైన్‌లో మరోసారి సీడింగ్ చేసి, వారి పేరుతో నకిలీ పొదుపు గ్రూపుల తయారు చేయడాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది.పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో ఆర్పీల అవినీతి వ్యవహారం, నకిలీ గ్రూపులపై పీడీ శ్రీహరి విచారణకు సిద్ధమయ్యారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు, అవినీతికి పాల్పడిన ఆర్పీల జాబితాను సిద్ధం చేస్తున్నారు. పొదుపు సంఘాల సభ్యులను మోసం చేస్తూ, బ్యాంకులను బురిడీ కొట్టిస్తూ కోట్లు దోచుకుంటున్న వారిపై కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. బోగస్ పేరుతో దోచుకున్న సొమ్మును రికవరీ చేసేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో వారిలో ఆందోళన మొదలవ్వగా, మరికొందరు ఆర్పీలు తమపైకి వస్తే అందులో భాగస్వాములైన వారిని బయటకు లాగుతామంటూ బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంచితే, కేశవస్వామిపేటకు చెందిన యానాది సామాజికవర్గానికి చెంది పలు పొదుపు సంఘాల సభ్యులను మోసం చేసిన ఆర్పీపై చర్యలు లేకపోవడం, తాజాగా పేర్నమిట్టకు చెందిన ఆర్పీ బాధిత పొదుపు సంఘాల పట్ల ఇదే తీరుతో మాట్లాడటం విస్మయం కలిగిస్తుంది. ఇప్పటికైనా మెప్మాలో అవినీతికి అడ్డుకట్ట వేస్తారా? ఆ ఆర్పీలపై చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే. గత వైసీపీ పాలనలో ఇబ్బడిముబ్బడిగా బోగస్ గ్రూపులు సృష్టించి సుమారు రూ.40 కోట్ల మేరదోచుకోగా, ఈ ఏడాది జనవరి నుంచి కూడా ఆ వ్యవహారం మళ్లీ మొదలైంది. ఇదిలా ఉంచితే మూడు నెలల క్రితం యానాది సామాజికవర్గం సభ్యులు ఆర్పీ తమను మోసం చేసిందంటూ రోడ్డెక్కగా.. తాజాగా పేర్నమిట్టకు చెందిన ఆర్పీ, దామచర్ల జనార్ధన్ కాలనీకి చెందిన పొదుపు మహిళలు బయటకొచ్చారు. తమను మోసం చేసి, వారి పేరుతో నకిలీ గ్రూపులు తయారు చేసి రుణాలు తీసుకుందని విమర్శించారు. దీనిపై కథనం ప్రచురించింది. ఈ వ్యవహారం ఇటు కార్యాలయ ఉద్యోగుల్లోనే కాకుండా, అటు మెప్మా కేంద్ర కార్యాలయంలోనూ చర్చనీయాంశంగా మారింది. అసలు అక్కడ ఏమి జరుగుతోంది.. అధికారులు ఏమి చేస్తున్నారు.. అనే విషయాలను ఆరా తీస్తుంది.రాష్ట్రప్రభుత్వం ఇంటికో మహిళను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు పలు పథకాలు అమలు చేస్తోంది. ఈ వాహనం,తృప్తి క్యాంటీన్, వీధి వ్యాపారాలకు ప్రోత్సాహం, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్, ఆహార తయారీ, రిటైల్ దుకాణాలు, డీజీ లక్ష్మి పథకంతో సేవా రంగాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పథకాలు ప్రతి పొదుపు మహిళకు చేరువ చేయాల్సి ఉందని, కానీ ఆ పథకాల పురోగతి మరిచి, ఆర్పీలు అవినీతికి పాల్పడటంపై శనివారం ఎండీ తేజభరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోగస్ గ్రూపులపై సమగ్ర విచారణ చేయాలని పీడీని ఆదేశించారు. అలాంటి వారిని నిర్మొహమాటంగా తొలగించి, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## అసాంఘిక శక్తులపై పోలీసుల ఉక్కుపాదం



నంద్యాల బ్యూరో జూలై 14 (సందేశం టైమ్స్): శాంతిభద్రతల పరిరక్షణ నేరం నియంత్రణలో భాగంగా తెల్లవారుజామున జిల్లాలోని అన్ని సబ్ డివిజన్లలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నిర్వహించారు.జిల్లాలోని అన్ సబ్ డివిజన్ పరిధిలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో చేపట్టిన వివరాలు%ొ%నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పొన్నాపురం కాలనీ నందు ఇన్స్పెక్టర్ కృష్ణయ్య ఎస్సై గంగ యాదవ్ ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో సరైన ధ్రువపత్రాలు లేని 6 వాహనాలను స్వాధీనం చేసుకోన్నారు.ఆత్మకూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కురుకుంద గ్రామం లో ఇన్స్పెక్టర్ రాము ఆధ్వర్యంలో సరైన ధ్రువపత్రాలు లేని పది మోటర్ సైకిల్ 14 క్వాటర్ బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు.ఆత్మకూరు రూరల్ సర్కిల్ లో పాములపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జూటూరు గ్రామం లో ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ రెడ్డి మరియు సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ నిర్వహణలో సరైన ధ్రువపత్రాలు లేని 09 మోటార్ సైకిల్లు,31 క్వాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.నందికొట్కూరు యు పి ఎస్ లో ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని జగనన్న కాలనీలో రికార్డులు లేని 10 బైక్‌లు మరియు 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.రూరల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండ్లెం గ్రామం, జూపాడుబంగ్లో లో సరైన రికార్డులు లేని 15 బైక్‌లు, 15 అక్రమ మద్యం బాటిల్లు, 7 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.ఆళ్లగడ్డ సబ్ డివిజన్ కోవెలకుంట్ల సర్కిల్ సంజామల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకుమల్ల గ్రామం లో ఇన్స్పెక్టర్ హనుమంతు నాయక్ సబ్ ఇన్స్పెక్టర్ రమణయ్య ల ఆధ్వరం లో సరైన ధ్రువపత్రాలు లేని 12 మోటార్ సైకిల్ 6 ఆటోలను స్వాధీనం చేసుకున్న రు.రుద్రవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నరసాపురం గ్రామం లో ఇన్స్పెక్టర్ దస్తగిరి బాబు సబ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో సరైన ధ్రువపత్రాలు లేని 21 మోటర్ సైకిలను స్వాధీనం చేసుకొన్నారు.

## పాముకాటుతో వ్యక్తి మృతి



ఎల్ఎన్ పేటజూలై 14 (సందేశం టైమ్స్): శ్యామలాపురం గ్రామానికి చెందిన ఇప్పిలి జగదీశ్వరరావు(50) పాముకాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. సాయంత్రం జగదీశ్వరరావు తన కోళ్లఫారంలోని కోడి తీస్తున్న సమయంలో కోడి కాళ్లగోళ్లు తగిలినట్లుగా అనిపించడంతో పట్టించుకోలేదు. పశువుల కోసం పక్కనే ఉన్న గడ్డికుప్పకు వెళ్లి గడ్డి తీసుకొని ఇంటికివచ్చేసరికి నోటి నుంచి సొంగలు వచ్చాయి. దీంతో వెంటనే ఆసుపత్రికి వెళ్లే క్రమంలో సరుబుజ్జిలి వచ్చేసరికి చనిపోయాడు. జగదీశ్వరరావుకి భార్య భానుమతి ఉంది.

## బుచ్చెంపేటలో కొట్లాట




రాజాం రూరల్,జూలై 14 (సందేశం టైమ్స్):: రాజాం మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చెంపేటలో రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో పదిమంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఇద్దరు రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరో ఐదుగురు రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాల మధ్య స్థలం విషయంలో ఉదయం వివాదం చెలరేగింది. రాత్రి వరకూ పెద్దల సమక్షంలో చర్చలు జరిగాయి. అయితే సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇరువర్గాలు కొట్లాటకు దిగారు. పిట్టా రాము, సత్యం, ముద్దన సూరిబాబు, పిట్టా రాజేంద్ర తదితరులంతా గాయపడిన వారిలో ఉన్నారు. రాజాం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బుచ్చెంపేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

## పట్టుదల ఉంటే క్రీడల్లో రాణించవచ్చు



శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 14 (సందేశం టైమ్స్): క్రమశిక్షణ, పట్టుదల ఉంటే క్రీడల్లో రాణిం చవచ్చని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ గూడేన సోమేశ్వరరావు అన్నా రు. స్థానిక శాంతినగర్ కాలనీ ఇండోర్ స్టేడియంలో రెండు రోజు లుగా జరుగుతున్న జిల్లా బ్యాడ్మిం టన్ చాంపియన్‌షిప్ ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. క్రీడాకారులు రాణిస్తున్నారంటే వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతైనా ఉందన్నారు. గెలుపు, ఓటము లు సమానంగా స్వీకరించాలన్నారు. జిల్లాలోని మారు మూల ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం జిల్లాస్థాయి విజేత లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బైరి దామోదర్, ఎంఎంవిలేఖర్, గురుగుబెల్లి రాజు, ఎం.వేణు, సీఈవో సంపతిరావు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కొడుకుతో వెళుతూ.. కానరాని లోకాలకు



సాలూరు రూరల్,జూలై 14 (సందేశం టైమ్స్): కొడుకుతో పొలానికి స్కూటీపై వెళ్లిన తండ్రి.. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఘటన సాలూరు గొర్లెవీధిలో చోటుచేసుకుంది. సాలూరు రూరల్ హెచ్‌సీ బంగా రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సాలూరు పట్టణం గొర్లె వీధికి చెందిన గొర్లె ధర్మారావు(43)కు సాలూరు బైపాస్ రోడ్డులో పొలం ఉంది. ఆయన తన కొడుకు గుణశేఖర్(14)ను వెంట బెట్టుకుని స్కూటీపై పొలానికి వెళ్లారు. అక్కడ నుంచి తండ్రీ కొడుకులు బైపాస్ రోడ్డుపై జీగిరాం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో స్కూటీని వెనుక నుంచి ఓ గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ ఎగిరి పడ్డారు. స్కూటీని ఆ వాహనం కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ఘటన లో ధర్మారావు తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడక్కడే మృతిచెందారు. గుణశేఖర్ గాయపడటంతో అతడిని తొలుత సాలూరు ఏరియా ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయనగరంలో ఆసుపత్రికి తరలించారు.

# సంపాదకీయం

## శతజయంతి ఉత్సవాల సందడేదీ

తెలుగు మాట వినిపిస్తేనే ఒంటిపై తేళ్ళు పాకినట్లుగా వ్యవహరించిన మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ను ముక్కుసూటిగా "ఓ నిజాము పిశాచమా! కానరాడు నిన్నుబోలిన రాజు మాకెన్నడేని" అని ధిక్కరించినవాడు దాశరథి! "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అని గురజాడ చెప్పిన స్థాయిలో%-% "ఘోర గహనాటడవులన్ వడగొట్టి, మంచి మాగాణములన్ సృజించి, యముకల్ నుసి చేసి, పొలాలు దున్ని, భోషాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే, తెలంగాణ రైతుదే" అన్నాడు. "ముసలి నక్కకు రాచరికంబు దక్కునే" అని ముష్కర నవాబును ఎదిరించిన కవికి ఎన్ని గుండెలు ఉండాలి. అలాంటి ప్రజాకవి దాశరథి శతజయంతి ఈ నెల 22వ తేదీన జరగనున్నది. హైదరాబాద్ రాజ్యాన్ని పాలించిన కుటిలమైన రాజుపై క్షేత్రంలో నిలబడి, సామాజిక ఆర్థిక అంశాలు ప్రస్తావిస్తూ, జనసామాన్యాన్ని చైతన్యపరుస్తూ, విప్లవాత్మకంగా పోరాటం చేసిన కవులు తెలుగు సాహితీలోకంలో దాశరథి మినహా మరొకరు లేరు. నిజాం రాజు దుష్టపాలనను ఎత్తిచూపుతూ కవితలు చెప్పటం ఏదో ఒక ఎయిర్ కండీషన్డ్ గదిలో కూర్చుని సినిమా పాటలు రాసినంత, కార్యాచరణ చేతగానివారు శ్రీరంగనీతులు బోధించినంత సులభం కాదు.దాశరథి కవితలోని చరణం %-% "నా తెలంగాణ కోటిరత్నాల వీణ" అన్నది తెలంగాణ రాష్ట్ర పోరాటవీరులకు నినాదమైందన్న విషయం విస్మరించరానిది. అది ఏకవాక్యమైనా ప్రత్యేకమైనది, పసందైనది, పండిన కవితకు పరాకాష్ఠ అయింది. కాబట్టి గత ప్రభుత్వం ఆయన స్మృతిని గౌరవించక తప్పలేదు. అయితే ఏటేటా ఆయన స్మారకార్థం ఒక వర్ధమాన కవికి పురస్కారం ప్రదానం చేసినంత మాత్రాన ఆయన టిఆర్ఎస్ పార్టీ చెందినవాడైపోడు! పైగా కేసీఆర్ నిజాంను దేవుడులా కొలిస్తే, దాశరథి నిజాంను 'పిశాచి'గా అభివర్ణిస్తూ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిన దేశాభిమాని, ఆత్మాభిమాని మరి.వాస్తవానికి దాశరథి ఒక జాతీయకవి. కాబట్టే జలగం వెంగళరావు హయాంలో వారిని ఆస్థానకవిగా నియమించి గౌరవించారు. కానీ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్.టి. రామారావు అర్ధాంతరంగా ఆయనను ఆ పదవి నుంచి తొలగించారు. అసలు దాశరథి ఎవరో, ఏమిటో ప్రభుత్వాధినేత అర్థం చేసుకుని ఉంటే, ఆయనకు మరొక పదవి కట్టబెట్టి ఆస్థాన కవి పదవి రద్దు చేసేవాడు. ఇలా ఆస్థాన పదవులను నియమించే సంప్రదాయం బ్రిటన్‌లో మూడు వందల సంవత్సరాలుగా కొనసాగుతున్నది. అక్కడ రాజరికం ఉన్నప్పుడూ ఉంది, ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాతా ఉంది. ఆస్థాన కవి పదవి ప్రజాస్వామ్య విరుద్ధమని, రాచమర్యాద అని ఎవరైనా అంటే అంతకన్నా అజ్ఞానం ఉండదు. రెండు వందల సంవత్సరాల పైచిలుకుగా ప్రజాస్వామ్యంగా వర్ధిల్లుతున్న అమెరికా సంయుక్త రాష్ట్రాలలో%-% దాశరథి ఆస్థానకవిగా కొనసాగిన సమయంలోనే%-% 19 రాష్ట్రాలలో ఆస్థానకవులు ఉన్నారు. సోషలిస్టు దేశాలలో చూస్తే%-% తజికిస్తాన్ రాష్ట్రానికి మిర్జో తుర్సునజోదా ఆస్థానకవి. ఇలా ఎన్నో ఉదాహరణలను చూపించవచ్చు.జాతీయ కవి స్థాయికి అర్హత గల కవిత్వం ఎంతో రాశారు దాశరథి. స్వాతంత్ర్య సమరగీతాలు, జయభారతీ అంటూ దేశభక్తి పొంగిపొర్లే పద్యాలు రాసారు. "జండా ఒక్కటె మూడు వన్నెలదిబీ దేశంబొక్కటే భారతాఖండాసేతు హిమాచలోర్వరబీ కవీట్కాండమ్ములోనన్ రవీంద్రుండొక్కండె కవీంద్రుండుబీ ఊర్జిత జగద్యుద్ధాలలో శాంతికోదండోద్యద్విజయుండు గాంధి ఒకడే, తల్లీ! మహాభారతీ!" అని శిలాక్షరాల్లాంటి పద్యాలెన్నో పాడారు. అందుకే ఆ రోజుల్లో విజ్ఞులైన రాజకీయవేత్తలు %-% సర్వేపల్లి రాధాకృష్ణన్, బూర్గుల రామకృష్ణరావు, పి.వి. నరసింహారావు, బెజవాడ గోపాలరెడ్డి, మర్రి చెన్నారెడ్డి లాంటి వారు మహానుభావులు దాశరథిని ఎంతో అభిమానించారు, గౌరవించారు.పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో మంత్రులకే కాదు శాసనసభ్యులకు కూడా వారి మాతృభాష పట్ల, సాహిత్యం పట్ల, సంస్కృతి పట్ల అపారమైన అభిమానం. బెంగాలీలు జాతీయకవిగా గౌరవించే రవీంద్రనాథ్ ఠాగూర్‌కు, తమిళులు దేశీ కవిగా నెత్తిన పెట్టుకొనే సుబ్రహ్మణ్యభారతికి, కన్నడిగులు రాష్ట్రకవిగా కొలిచే కె.వి. పుట్టప్పలకు ఏమాత్రం తీసుపోకుండా జగత్ కళ్యాణం కోసం అచంచల విశ్వా సంతో దేశభక్తి గీతాలను, అక్షర లక్షలు చేసే అభ్యుదయ కవితలను, ఏ ఇజాల జోలికి పోకుండా మానవతా దృష్టితో పలికిన వైతాళికుడు దాశరథి. అదేమి విచిత్రమోగాని తెలంగాణ లోని రాజకీయనాయకులకు ఆ పరంపర సంక్రమించలేదు.దాశరథి శతజయంతి ఉత్సవాలు తెలంగాణలోని ప్రతిజిల్లాలో ఘనంగా, స్ఫూర్తి దాయకంగా నిర్వహించవలసిన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంకా కిమ్మనకుండా కూర్చోవడం విచారకరం. తెలంగాణకు పేరుకు సాహిత్య అకాడమీ, సాంస్కృతికశాఖ ఉన్నాయి. కాని ఇలాంటి అంశాలలో అవి అంటీముట్టనట్టుగా ఉన్నాయి. వాస్తవానికి ఈ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సాహిత్య అకాడమీకి రాష్ట్రమంతా వెతికినా సరైన అధ్యక్షుడు దొరకకపోవడం గమనించదగినది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి కనీసం సాంస్కృతిక సలహాదారు ఒకరు ఉన్నా గుడ్డికన్నా మెల్లలా ఉండేది.ఈమధ్యే దక్షిణ భారత దేశంలోనే తొలుదొలుత జానపద సాహిత్యంపై పరిశోధన చేసి విశ్వవిద్యాలయాల్లో జానపద వాఙ్మయ, కళల ప్రవేశానికి ఆద్యుడైన బిరుదురాజు రామరాజు శతజయంతి జరిగింది. అంతకుముందు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఎంతగానో కృషిచేసిన దివాకర్ల వెంకట అవధాని శతజయంతి జరిగింది.

# ఎరువుల కోసం రైతులు క్యూకట్టే పరిస్థితి తేవద్దు



అమరావతి, జూలై 14 (సందేశం టైమ్స్): ఎరువులు లేవనే అపోహలు గానీ, ఎరువుల కోసం ఎక్కడా రైతులు క్యూలో వేచి ఉండే పరిస్థితులు గానీ ఉండకూడదని వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ రాజశేఖర్ జిల్లా అధికారులకు స్పష్టం చేశారు. కర్నూలు, శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో రైతులు బారులు తీరిన పరిస్థితుల్లో ఆయన జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎరువుల కోసం రైతులు క్యూలో ఉండాల్సిన పరిస్థితులు తేవొద్దన్న సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో ఎరువుల లభ్యతపై వాస్తవ పరిస్థితులను రాజశేఖర్ వాకబు చేశారు. రానున్న రెండు నెలలు ఎరువుల పంపిణీ అత్యంత కీలకమని, సాగు విస్తీర్ణం, పంటలకు అవసరమైన ఎరువులు, జిల్లాల్లో నిల్వలపై బేరీజు వేసుకుని, వ్యవసాయ, సహకార, మార్క్‌ఫెడ్ అధికారులు సమన్వయంతో అంతర్గత యాజమాన్యంపై శ్రద్ధ పెట్టాలని ఆయన సూచించారు. మన్యం, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్లు శ్యాంప్రసాద్, స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ తమ జిల్లాల్లో పంటల సాగు విస్తీర్ణానికి తగ్గ ఎరువుల నిల్వలున్నాయని, రైతులకు ఎరువులు అందవనే అపోహ అవసరం లేదని స్పష్టం చేశారు. కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా స్పందిస్తూ.. గత ఐదేళ్లు సొసైటీల్లో ఎరువుల పంపిణీ అలవాటు తప్పిందని, ఇప్పుడు రైతులంతా డీసీఎంఎస్ ఎరువుల పాయింట్‌కు రావడంతో క్యూలో వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని వివరించారు. మార్క్‌ఫెడ్‌కు ఇచ్చే 50% కోటా నుంచి రైతుసేవా కేంద్రాలకు ఎరువుల వికేంద్రీకరణ జరిగితే రైతులు క్యూలో ఉండాల్సిన అవసరం ఉండదని సూచించారు. జిల్లాల వారీగా అందుబాటులో ఉన్న ఎరువులు, జూలై, ఆగస్టులో రానున్న ఎరువుల వివరాలను వ్యవసాయశాఖ డైరెక్టర్ వివరించారు.

# విద్యాసంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయంపై నిషేధం



కంటోన్మెంట్ జూలై 14 (సందేశం టైమ్స్): జిల్లాలో విద్యాసంస్థలకు సమీపంలోని పాన్ షాపుల్లో, కిరాణా దుకాణాల్లో సిగరెట్లు, నిషేధిత ఖైనీ, గుట్కాలు, మత్తు కలిగించే ఇతర పొగాకు వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పి వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో స్థానిక పోలీసులు, ఈగల్, ఎస్‌బి సిబ్బంది సంయుక్తంగా విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పాన్‌షాపులు, కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించామని చెప్పారు. ఇందులో భాగంగా గత ఐదు రోజులుగా జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలకు సమీపంలోని పాన్ షాపులు, కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయించిన 512 మంది వ్యాపారులపై కోటా చట్టం (ది సిగరెట్స్ అండ్ అదర్ పొగాకు ప్రొడక్ట్స్ 2003 చట్టం) ప్రకారం కేసులు నమోదు చేసి, వారిపై రూ.1,13,900ను జరిమానాగా విధించామని వివరించారు. విద్యాలయాలకు దగ్గరలో ఉన్న పాన్, కిరాణా షాపుల్లో పొగాకు ఉత్పత్తులను విక్రయించడం వల్ల విద్యార్థులు వీటిని వినియోగించేందుకు అలవాటుపడి, వక్ర మార్గంలో ప్రయాణించే అవకాశం ఉందని వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పొగాకు ఉత్పత్తులను విక్రయించకుండా చర్యలు చేపట్టేందుకు వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు స్వస్తి పలకాలని కోరారు. ఈ తరహా దాడులు భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తామని చెప్పారు.

# డిగ్రీ ప్రవేశాలు చేపట్టాలని 16న చలో కలెక్టరేట్



విజయనగరం టౌన్ జూలై 14 (సందేశం టైమ్స్): డిగ్రీ ప్రవేశాలు వెంటనే చేపట్టాని ఈ నెల 16న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టనున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్.వెంకటేష్ తెలిపారు. నగరంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్లీనరీ తీర్మానాలను మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీలో ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి, ఆఫ్‌లైన్‌లోనే అడ్మిషన్లు చేపట్టాలని, డబల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాజాం, గజపతినగరం విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సి, ఎస్టి, బిసి హాస్టళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. 107, 108 జిఒలను రద్దుచేసి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్ల అమ్మకాన్ని ఆపాలని, మెడికల్ కాలేజీ భవనాలు పూర్తి చేసి, కళాశాలకు అనుబంధంగా వసతిగృహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థలో ఉన్న సంక్షేమ హాస్టళ్లకు సొంతభవనాలు నిర్మించాలన్నారు. ఎటువంటి షరతులూ లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ తల్లికి వందనం పథకంలో రూ.15 వేలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించి, నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. విద్యార్థులకు హాస్టల్, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. జిఒ నెంబర్ 19, 20, 21ను రద్దుచేసి పాఠశాలల విలీనాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, మండలానికి ఒక పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ఈ అంశాలపై ప్లీనరీలో తీర్మానాలు చేశామని, వాటి సాధన కోసం భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పావని, జిల్లా ఉపాధ్యక్షులు వి.చినబాబు, జిల్లా గర్ల్స్ కో- కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ ఆర్.శిరీష పాల్గొన్నారు.

# తస్సాదియ్య,, లాబ్ స్టార్ రొయ్య



జూలై 14 (సందేశం టైమ్స్):మాంసాహార ప్రియులకు చేపల్లో 'పులస' ఎలా నోరూరిస్తుందో రొయ్యల్లో లాబ్‌స్టార్ కూడా అంతే!. ఎప్పుడో ఒక్కసారి మాత్రమే లభించే ఈ రొయ్యను ఆస్వాదించేందుకు పోటీ పడతారు. దీంతో ఈ రొయ్యకు భారీ డిమాండ్ ఉంది. తాజాగా విశాఖకు చెందిన ఓ మత్స్యకారుడి వలకు రెండు లాబ్‌స్టార్ రొయ్యలు చిక్కాయి. వీటిని ఫిషింగ్ హార్బర్‌కు తెచ్చి విక్రయించగా ఒక్కొక్కటీ రూ.2,500 చొప్పున ధర పలికింది. ఒక్కొక్క రొయ్య కిలోన్నర ఉంటుందని మత్స్యకారుడు తెలిపారు. ఈ ?రొయ్య రుచిగా ఉండడంతోపాటు ఎక్కువ రోజులు నిల్వ చేసుకోవచ్చని చెప్పారు.

# వాయిల సింగారం గ్రామంలో ఆశాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులు పుస్తకాలు పంపిణీ





సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయిల సింగారం గ్రామంలో సోమవారం నాడు ఆశాజ్యోతి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఎస్వీ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గద్దె రఘు సారు ఆధ్వర్యంలో జడ్.పి.హెచ్.ఎస్ వాయిల సింగవరం ఎంపీపీ ఎస్ వాయిల సింగవరం ఎంపీపీ ఎస్ హెచ్ డబ్ల్యు వాయిల సింగవరం పాఠశాల ల విద్యార్థులకు 200 బ్యాగులు 1200 నోటు పుస్తకాలు ఆశాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పంచనైనది ఈ కార్యక్రమం కు జడ్.పి.హెచ్.ఎస్ వాయిల సింగవరం జిహెచ్ఎం చలసాని శేఖర్ అనంతగిరి మండల విద్యాధికారి తల్లాడ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది గ్రామ పెద్దలు మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేష్ రావు సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాజీ గ్రామ సర్పంచ్ వెంపటి వెంకటేశ్వర్ రావు ప్రాథమిక పాఠశాల పాఠశాల హెడ్మాస్టర్ బి బావ సింగ్ ప్రాథమిక పాఠశాల 2 హెడ్మాస్టర్ ఆర్ జ్యోతి ఆశాజ్యోతి ఫౌండేషన్ నుంచి బ్యాగులు పుస్తకాలు తీసుకొచ్చి అందించిన గద్దె రఘు టీచర్ దాములూరి సుబ్బారావు (సీనియర్ క్రికెట్ ప్లేయర్ ) జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సుంకరి వీరమ్మ గుండ్లపల్లి వెంకన్న ముదిరాజ్ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు అనంతరం స్కూల్ ఆవరణలో మండల విద్యాశాఖ అధికారి తల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగినది

# అన్నదాతకు అండగా నేనున్నానంటూ

## మెదక్ ఎంఎల్ఏ మైనంపల్లి రోహిత్ రైతులకు అండగా ఉంటాను



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 14జులై: తన వరుస పర్యటనలతో మెదక్ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటూనే వాటి పరిష్కారాలు సైతం వేగంగా చూపుతున్నారు.దీనిలో భాగంగా వివిధ మండలాలకు చెందిన రైతులు తమ పొలాలు నీరు లేక వెలవెలబోతున్నాయని వర్షాలు వెనకడుగు వేయటంతో రైతన్నలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తెలుపగా, వెంటనే స్పందించి ఎంఎల్ఏ రోహిత్ ఇరిగేషన్ %జజు% మరియు %జుచీజ% అంజద్ హుస్సేన్ గారితో మాట్లాడి సింగూరు నుండి ఘనపూర్ ఆయకట్టుకు 0.5 టిఎంసి ల నీటిని విడుదల చేయాలని కొరటం జరిగింది.దీనికి స్పందించిన అధికార యంత్రాంగం నీటి లభ్యత ఆధారంగా తగు నీటిని విడుదల చేసి రైతుల పంటల రక్షణకు సహకరిస్తామని తెలపటం జరిగింది.

# ఘనపూర్ ప్రాజెక్టు ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేయాలి.. లేదంటే రైతులతో కలిసి ధర్నాలు



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 14జులై: మెదక్ : 4 రోజుల్లో సింగూరు నుండి ఘనపూర్ ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలని లేదంటే మెదక్, నర్సాపూర్ నియోజక వర్గాల రైతులతో పెద్ద ఎత్తున మెదక్ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి హెచ్చరించారు.

సోమవారం మెదక్ కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు కలెక్టరేట్ ఆవరణలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు కంట కన్నీళ్లు పెట్టిస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాటి మాటికి సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లా అంటారు తప్ప ఇక్కడి రైతుల పరిస్థితి పట్టించుకున్న పాపాన పోవడం లేదని విమర్శించారు. సింగూరులో నీళ్లు ఉన్నపటికీ ఘనపూర్ ప్రాజెక్టుకు 0.4 టీఎంసీలు వాటాగా రావాల్సినవి విడుదల చేయడం లేదని విమర్శించారు.

గతంలో కేసీఆర్ ప్రభుత్వం హయాంలో సమయానికి నీళ్లు వదిలించామని చెప్పారు. గత పది సంవత్సరాల్లో రైతులు ఎన్నడూ రోడ్డెక్కిన పరిస్థితి లేదన్నారు. సింగూరు, కాళేశ్వరం జలాలు, కొండపోచమ్మ సాగర్ నుండి హల్దీ ప్రాజెక్టుకు సాగు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

- ప్రొటోకాల్ పాటించండి..

నర్సాపూర్ నియోజక వర్గంలో దుబ్బాక నియోజకవర్గంలోని నార్సింగ్, చేగుంట, గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్ మండలాలలో అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్యేలను కాదని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఎమ్మెల్యేలు కానీ అధికార పార్టీ ఇంచార్జీలు, నాయకులు చేస్తున్నారని, అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేకు ఎస్కార్ట్ ఇవ్వకుండా అధికార పార్టీ నేతలకు పోలీసులు ఎస్కార్ట్ ఇస్తున్నారని మండి పడ్డారు.

ప్రొటోకాల్ విషయంలో సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి ఇలాంటి సంఘటనలు పునరావృతం జరగకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్, బట్టి. జగపతి, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు యం లావణ్య రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కోకన్వీనర్ కృష్ణ గౌడ్, లింగారెడ్డి జుబేర్, న్యాయవాది జీవన్ రావు, మాజీ కౌన్సిలర్లు జయరాజ్ ఆర్కే శ్రీనివాస్, మాయ మల్లేశం, ఏడుపాయల మాజీ చైర్మన్ బాలగౌడ్, మెదక్ నర్సాపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల మాజీ జడ్పిటిసిలు ఎంపీపీలు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బి సి ప్రజా ప్రతినిధుల ఫోరం(బీసీపీయఫ్) ఆధ్వర్యంలో బీసీల రిజర్వేషన్ మహా ధర్నా లో పాల్గొంటున్న తాజా మాజీ ఎంపీటీసీ తమ్మన్నగారి సంగన్న






సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 14జులై: బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చడమొక్కటే పరిష్కారం డిమాండ్ చేస్తూ %దీజూఖీ% ఆధ్వర్యంలో జులై 15 చలో హైదరాబాద్ ఇంద్ర పార్క్ లో మహాధర్నా విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర పర్యటిస్తున్న మహబూబ్నగర్ జిల్లాలో సందర్భంలో ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడీల కుమార్ గౌడ్ మరియు ఎంపీటీసీ తమన్న గారి సంగన్న ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ బీసీలకు 42 శాతం మరియు విద్య ఉద్యోగాలలో 42% రిజర్వేషన్లు కల్పించడానికి ఆర్డినెన్స్ ఇవ్వడం ఏ విధంగానూ చట్టబద్ధత కల్పించినట్లు కాదు. బీసీలను మోసం చేయడానికి ఇది మరో రూపం మాత్రమే.

పార్లమెంటు ద్వారా రాజ్యాంగ సవరణ చేయించి బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్ లో చేర్చడమొక్కటే పరిష్కారం. ఆ ప్రయత్నం చేయకుండా ఏమి చేసినప్పటికీ బీసీ లను మోసగించడం తప్ప మరేం కాదు. అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రాజకీయ%శీ% పక్కనపెట్టి తమిళనాడు తరహాలో తక్షణమే అన్ని రాజకీయ పార్టీలతో కూడిన అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసి పార్లమెంటులో ఒత్తిడి చేస్తేనే సాధ్యమవుతుంది.

# కరాటే లో రాణించి కోదాడకు పేరు తేవాలి

## కరాటే లో ఉత్తమ శిక్షణ ఇస్తున్న సుమన్ షాటోఖాన్ కరాటే అకాడమీ మాస్టర్లు అభినందనీయులు

## టిల్ బ్లోసమ్స్ ప్లే స్కూల్ లో బెల్టు గ్రేడింగ్ టెస్ట్ కు భారీ స్పందన




విద్యార్థులు కరాటే లో రాణించి కోదాడకు పేరు ప్రఖ్యాతలు తేవాలని ది లిటిలే బ్లోసమ్స్ ప్లే స్కూల్ చైర్మెన్ టి.జీ గణేష్ కుమార్ గారు,కరివిరాల మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ టి సాయి ఈశ్వరి గారు అన్నారు. ఆదివారం కోదాడ ఉత్తమ్ పద్మావతి నగర్ లోని ది లిటిల్ బ్లోసమ్స్ ప్లే స్కూల్ లో సుమన్ షాటోఖాన్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యం లో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లో వారు ముఖ్య అతిథులు గా పాల్గొని మాట్లాడారు. కరాటే తో శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది అన్నారు. కరాటే విద్యను ప్రభుత్వం క్రీడాంశంగా గుర్తించిందన్నారు. నగరాలకు దీటుగా కోదాడలో కరాటే శిక్షణ ఇస్తున్న సుమన్ షాటోఖాన్ కరాటే అకాడమీ మాస్టర్ల ను అభినందించారు. బ్లాక్ బెల్ట్ సెకండ్ డాన్ కరాటే మాస్టర్ కొండపల్లి క్రాంతి కుమార్ మాట్లాడుతూ 50 మంది విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించామన్నారు. బెల్ట్ గ్రేడింగ్ టెస్టులతో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. మాస్టర్ కొండపల్లి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో , మాస్టర్ సుభాని బ్లాక్ బెల్ట్, మాస్టర్ రక్షిత్ బ్లాక్ బెల్ట్, చక్రవర్తి, వీఈటీ నాగన్న , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఓసీలు అంతా కలిసి మాపై దాడికి కుట్ర

హైదరాబాద్, పీర్జాదిగూడ, పంజాగుట్ట, జూలై 14: “ఎగువ కులాల వాళ్లంతా ఏకమై మాపై(బీసీలపై) దాడి చేయాలని చూస్తున్నారు” అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. గతంలో పరకాల, బైరాన్‌పల్లిలో బీసీ మహిళలను నగ్నంగా బతుకమ్మ ఆడించిన జాతి వాళ్లదని విమర్శించారు. “బీసీలమంతా కలిసి రాజకీయ పార్టీగా ముందుకొస్తాం. రాష్ట్రంలో అధికారాన్ని చేపడతాం” అని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పీర్జాదిగూడలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని బీసీలంతా ఒకవైపు.. కల్వకుంట్ల కుటుంబం ఒకవైపు అని చెప్పారు. తన మీద వారి మనుషులను ఉసిగొల్పడం ద్వారా కవిత హత్యాయత్నం చేశారని.. ఆమెపై డీజీపీకి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. తన మీద, తన కార్యాలయం మీద దాడి చేసింది సుజిత్ రావు కల్వకుంట్ల కవిత బంధువే నని పేర్కొన్నారు. ఎథిక్స్ కమిటీ దృష్టికి కవిత వ్యవహారం తీసుకెళ్లి ఆమె సభ్యత్వం రద్దు చేయాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశాం” అని చెప్పారు. తనపై తెలంగాణ జాగృతి జరిపిన దాడిని బీఆర్ఎస్ నేతలు కూడా స్వాగతించలేదని, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం, ఇతర కాంగ్రెస్ పెద్దలు ప్రెస్‌మీట్ పెట్టి మరీ కవితకు అండగా నిలిచారని విమర్శించారు.

